ఉచితంగా ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు

హిమాయత్‌నగర్, అక్టోబర్ 16: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఉచితంగా ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సిగ్మా అకాడమీ చైర్మన్ ఎం.సి.శేఖర్, ప్రతినిధి కె.జనార్దన్ తెలిపారు. ఆ కోర్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత ఫొటోగ్రఫీ నేర్చుకోవడం పట్ల ఆసక్తి ఉంటే ఈ కోర్సులో చేరి ఉపాధి పొందవచ్చని, ఆరు నెలలపాటు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫొటోగ్రఫీ, పిక్టోరియల్ షూటింగ్ నైపుణ్యాలు, అధునాతన సాంకేతికతలు, కంపోజిషన్, లైటింగ్, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నవంబర్ 14 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, ఆసక్తి గల అభ్యర్థులు నం: 8008021075-7095692175లకు ఫోన్ చేసి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

18 నుంచి సౌత్‌జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్

మారేడ్‌పల్లి, అక్టోబర్ 16: ఈఎన్‌టీలో అధునాతన పురోగతులపై సౌత్‌జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్- 2024 శామీర్‌పేటలోని అలంకృత రిసార్ట్‌లో ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ డీఎస్ దీనదయాల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఈస్ట్ మారేడ్‌పల్లిలోని షెనాయ్ నర్సింగ్‌హోంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఈ కాన్ఫరెన్స్‌ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ప్రారంభించనున్నారని, వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ ఛాన్సలర్ కరుణాకర్‌రెడ్డి అతిథిగా హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఈ కాన్ఫరెన్స్ తెలంగాణలో 9వ, సౌత్ జోన్‌లో 19వ దని చెప్పారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తదితర దక్షిణాది రాష్ట్రాల నుంచి వెయ్యి మందికిపైగా ప్రతినిధులు హాజరుకానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇండియా టీజీ సౌత్ కాన్ఫరెన్స్ సమన్వయకర్త డాక్టర్ డి.ద్వారకానాథ్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్. వెంకట్‌రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు ఎల్లయ్యకు ఆర్థిక సాయం

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : హోంగార్డు పోలీస్ డిపార్టుమెంట్‌కు చెందిన కె. ఎల్లయ్య వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1,06,108 చెక్కును వారి కుటుంబ సభ్యులకు టీజీఎస్‌పీ అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్ బుధవారం అందచేశారు. గత మూడు రోజుల కిత్రం ఎల్లయ్య అనారోగ్యానికి గురై వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని యశోద హాస్పటల్‌లో అడ్మిట్ అయ్యారు. ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ కావడంతో వైద్యం కోసం డబ్బు అవసరమైంది. ఈ మేరకు స్పందించిన సంజయ్‌కుమార్ జైన్ టీజీఎస్‌పీ హెల్ప్‌లైన్ హ్యాండ్స్ తరపున ఆర్థిక సాయం చేశారు.

90 శాతం విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

ఉస్మానియా యూనివర్శిటీ, అక్టోబర్ 16: ఓయూ క్యాంపస్‌లో కామర్స్‌లో స్నాతకోత్సవ విద్య పూర్తి చేసిన దాదాపు 90 శాతం విద్యార్థులకు ఉద్యోగావకాశాలు దక్కినట్లు డిపార్టుమెంట్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంకాం, ఎంకాం ఐఎస్ చదివిన విద్యార్థులు నాలుగో సెమిస్టర్ పూర్తి కాకుండానే ఉద్యోగాలకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఓయూలో జరిగిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో విద్యార్థులు డెలాయిట్, యూఎస్ కంపెనీల్లో అత్యంత పోటీ ఉన్న ఉద్యోగాలు పొందినట్లు ఆయన పేర్కొన్నారు. మిగతా విద్యార్థులు దీన్ని స్ఫూర్తిగా తీసుకొని రానున్న రోజుల్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో రాణించాలని ఆయన సూచించారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో కోహెడలో పండ్ల మార్కెట్‌ను నిర్మించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. రెండు వందల ఎకరాల్లో రూ.400కోట్ల వ్యయంతో నిర్మాణ పనులను చేపట్టేందుకు డీపీఆర్‌ను సైతం రెడీ చేసింది. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆతర్వాత చేపట్టాల్సిన ప్రక్రియ ఆగిపోయింది. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం పండ్ల మార్కెట్ ఏర్పాటును పక్కన బెట్టింది. పరిపాలన అనుమతుల కోసం ప్రభుత్వానికి పంపిన ఫైల్ సీఎం వద్ద పెండింగ్‌లో ఉన్నది. దీంతో ఆసియాలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్‌గా రూపుదిద్దుకోవాల్సిన కొహెడ పండ్ల మార్కెట్ కలగానే మిగిలిపోతున్నది. ప్రస్తుతం మార్కెట్ నడుస్తున్న బాట సింగారంలో ప్రైవేటు స్థలాలకు నెలనెలా రూ.70లక్షల అద్దెను చెల్లిస్తున్నప్పటికీ ప్రభుత్వం భారంగా భావించడం లేదు. సరికదా.. ఖాతాలో రూ.314కోట్లు మూలుగుతున్నప్పటికీ మార్కెట్ ఏర్పాటుకు మీనమేషాలు లెక్కిస్తుండడంతో అటు రైతుల నుంచి ఇటు వ్యాపారుల నుంచి సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- రంగారెడ్డి, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ)

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాట సింగారంలో తాత్కాలికంగా కొనసాగుతున్న ఫ్రూట్ మార్కెట్

కొహెడ ఫ్రూట్ మార్కెట్ కలేనా!

గడ్డిఅన్నారం టూ బాట సింగారం..

ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా గడ్డి అన్నారంలోని పండ్ల మార్కెట్‌ను అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడకు తరలించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఓఆర్ఆర్‌కు పక్కనే అతిపెద్ద పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఈ మేరకు మూడేండ్ల కింద కొహెడలో తాత్కాలికంగా మార్కెట్‌ను ఏర్పాటు చేయగా.. రేకుల షెడ్లన్నీ గాలి దుమారానికి కూలిపోయాయి. దీంతో కొహెడకు చేరువలోనే ఉన్న బాట సింగారంలోని హెచ్ఎండీఏ లాజిస్టిక్ పార్క్‌కు తరలించారు. 2021 అక్టోబర్ నుంచి బాట సింగారంలోనే పండ్ల మార్కెట్ కొనసాగుతున్నది.

సకల హంగులతో నిర్మించేలా ప్రణాళిక

ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్‌గా నిలిచేలా కొహెడ పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ప్రముఖ మార్కెట్లయిన న్యూఢిల్లీలోని అజాద్ పూర్, ముంబయిలోని వాసి, గుజరాత్‌లోని రాజ్‌కోట్, బరుదా మార్కెట్లను సందర్శించి నమూనాను రూపొందించారు. 48.71 ఎకరాల్లో షెడ్ల నిర్మాణం, కమీషన్ ఏజెంట్లకు దుకాణాలు, 16.50 ఎకరాల్లో కోల్డ్ స్టోరేజీల నిర్మాణం, 11.76 ఎకరాల్లో పండ్ల ఎగుమతులకు ఎక్స్‌పోర్టు జోన్, 56.54 ఎకరాల్లో రహదారులు, 11.92 ఎకరాల్లో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేసేలా డిజైన్ చేశారు. రూ.400కోట్ల వ్యయంతో అంచనాలు రూపొందించి గత ప్రభుత్వంలోనే డీపీఆర్‌ను సైతం సిద్ధం చేశారు. ఓఆర్ఆర్‌కు, శంషాబాద్ విమానాశ్రయానికి దగ్గరగా ఉండడంతో కొహెడ ప్రాంతాన్ని అప్పటి ప్రభుత్వం ఎంచుకోగా.. 2047 నాటి అవసరాలకు అనుగుణంగా గత ప్రభుత్వం ముందు చూపుతో డీపీఆర్‌ను రూపొందించింది. ఆతర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ ఏర్పాటును పట్టించుకోకపోవడంతో ఒక్క అడుగు సైతం ముందుకు పడలేదు.

నిధులు ఉన్నప్పటికీ నిర్లక్ష్యం..

బాట సింగారంలో తాత్కాలికంగా 44 ఎకరాల్లో పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి హెచ్ఎండీఏ తోపాటు, ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన స్థలాలను అద్దెకు తీసుకున్నారు. వాటిల్లో కోల్డ్ స్టోరేజ్‌లు, గోడౌన్లతోపాటు అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఇక్కడి మార్కెట్‌ను నమ్ముకునే 306 మంది లైసెన్స్‌డ్ కమీషన్ ఏజెంట్లు పని చేస్తున్నారు. నిత్యం ఇక్కడి మార్కెట్‌కు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి వివిధ రకాల పండ్లు వస్తుంటాయి. రంజాన్ మాసంలో ముంబయి నుంచి ఖర్జూర భారీగా ఇక్కడకు దిగుమతి అవుతున్నది. వేసవిలో రికార్డు స్థాయిలో మామిడి పండ్ల విక్రయాలు జరుగుతాయి. దేశ, విదేశాలకు ఇక్కడి నుంచే పండ్ల ఎగుమతులు, దిగుమతులు జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఇక్కడి పండ్ల మార్కెట్‌లో రూ.1500కోట్ల టర్నోవర్ జరుగుతున్నది. ఈ క్రమంలో మార్కెట్‌కు ఆదాయం సైతం బాగానే వస్తుండగా.. వచ్చిన ఆదాయం పూర్తిగా అద్దెలకే సరిపోతున్నది. ప్రతి నెలా అద్దె రూపంలో స్థలాల యజమానులకు రూ.70లక్షల వరకు చెల్లిస్తున్నారు. గత మూడేండ్లలోనే రూ.22కోట్లను అద్దె రూపంలో చెల్లించినట్లు తెలిసింది. శాశ్వత ప్రాతిపదికన కొహెడలో మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే మార్కెట్‌కు పెద్ద ఎత్తున మిగులుబాటు కలుగనుండగా.. ప్రభుత్వం ఆదిశగా ఆలోచన చేయడం లేదు. మరోపక్క కొహెడలో మార్కెట్ నిర్మాణం కోసం వివిధ మార్కెట్ల నుంచి సేకరించిన రుణం డబ్బులు సైతం ఫ్రూట్ మార్కెట్ అకౌంట్‌లో మూలుగుతున్నాయి. 65 మార్కెట్ కమిటీల నుంచి రూ.314కోట్ల రుణాన్ని తీసుకుని ఖాతాలో జమ చేశారు. మార్కెట్ నిర్మాణానికి పరిపాలన అనుమతుల కోసం ప్రభుత్వానికి పంపగా.. సంబంధిత ఫైల్ సీఎం వద్ద నెలల తరబడిగా పెండింగ్‌లోనే ఉన్నది. నిధులు ఉన్నప్పటికీ ప్రభుత్వంలో కదలికలు లేకపోవడం వల్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కొహెడ పండ్ల మార్కెట్ నిర్మాణానికి త్వరలోనే సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఇక్కడ సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నదని చుట్టుపక్కల ఉన్న పూలు, కూరగాయలు, ఉల్లిగడ్డలకు సంబంధించిన మార్కెట్లను సైతం ఇక్కడే ఏర్పాటు చేసే అవకాశం ఉన్నదని చెప్పారు.

ఆసియాలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం ప్రణాళిక

రూ.400 కోట్లతో చేపట్టేందుకు డీపీఆర్ సైతం సిద్ధం

అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆగిపోయిన ప్రక్రియ

ఖాతాలో రూ.314 కోట్లు ఉన్నప్పటికీ.. పనులు చేపట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

మార్కెట్ ఆదాయమంతా అద్దెలకే.. నెలనెలా రూ.70లక్షల వరకు చెల్లింపు

పరిపాలన అనుమతులు ఇవ్వడంలో ఎడతెరగని జాప్యం

సీఎం వద్ద ఫైల్ పెండింగ్

కొత్త మార్కెట్ నిర్మాణం కోసం రైతులు, వ్యాపారులకు తప్పని నిరీక్షణ

మూసీ నిర్వాసితుల పిల్లలకు రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశం

సిటీబ్యూరో, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : మూసీ ప్రక్షాళనలో భాగంగా ఇండ్లు కోల్పోయిన రెండు కుటుంబాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ పాఠశాలలో ఎట్టకేలకు ప్రవేశం కల్పించారు. జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ విభాగానికి చెందిన పీఓలు, ఆర్ పీల కృషితో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఎలాంటి ఎంట్రన్స్ పరీక్ష లేకుండా ప్రవేశం కల్పించారు. మాదవి (7వ తరగతి), శిరీష (8వ తరగతి), తేజస్వీ (5వ తరగతి)లో ప్రవేశం పొందారు. సరూర్‌నగర్ టీజీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్‌లో వీరికి ప్రవేశం కల్పించారు. యూసీడీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి చొరవ తీసుకొని టీజీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ ప్రశాంతితో మాట్లాడి ఎలాంటి ఎంట్రన్స్ లేకుండా విద్యార్థులు ఉచిత విద్యను పొందేలా అడ్మిషన్ చేయించారు.

బీసీ కులగణనకు సహకరించాలి

అంబర్‌పేట, అక్టోబర్ 16: బీసీ కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసమే ఈ కులగణన చేపట్టడం జరిగిందని చెప్పారు. కులగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలో గల మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి బుధవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకున్నారని, 90 శాతం ప్రజలకు అన్యాయం జరుగుతుందని భావించి.. లెక్కలు తీసి ఈ కులగణన చేయాలన్నారని పేర్కొన్నారు. రాహుల్ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభు త్వం కులగణనకు జీవీ జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, మాజీ కార్పొరేటర్లు పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, పులిజగన్, సీనియర్ నాయకులు గరిగంటి రమేశ్, యూసుఫ్ అఫ్సర్ జహీ, రామ్మోహన్‌రావు, కోటం అనిల్‌కుమార్, గడ్డం శ్రీధర్‌గౌడ్, జమీల్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్నాథం పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 16: సుప్రీంకోర్టు నిర్ధారించిన క్యాట్ ఉత్తర్వులను తపాలాశాఖలో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులకు యథాతథంగా అమలు చేయాలని తపాలాశాఖ విశ్రాంత ఉద్యోగుల జేఏసీ నాయకుడు యెర్రంశెట్టి దుర్గాప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అబిడ్స్‌లో గల డాక్‌సదన్, జీపీఓ ముందు విశ్రాంత ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన నిరసనలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన పాల్గొని మౌన దీక్ష చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంస్థ తపాలశాఖలో 1980లో గంటకు రెండు రూపాయల చొప్పున వేతనంతో తమ సేవలను తపాలశాఖ వినియోగించుకుందని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలనుండి 383మంది పనిచేశామని, ఇందులో కొందరు మరణించగా, ఉన్నవారికైనా న్యాయం చేయాలని, న్యాయబద్ధమైన హక్కుల సాధనకు మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 35 ఏండ్ల పోరాటంపై న్యాయస్థానం తీర్పు ప్రకారం తమకు అన్ని రాయితీలు అందించాలని పోస్టల్ డైరెక్టరేట్‌కు ఆదేశాలు జారీ చేసినా నేటికీ కోర్టు తీర్పును అమలు చేయడం లేదని మండిపడ్డారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ నాయకులు రవికృష్ణ, పి.యాదగిరి, కె.యాదగిరి, కారుణ్య, ఎలిజబెత్ , తదితరులు పాల్గొన్నారు.

అర్హతలేని ఏజెన్సీలను రద్దు చేయాలి..

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ నారాయణ

చిక్కడపల్లి, అక్టోబర్16 : జలమండలిలో అర్హతలేని ఏజెన్సీలను రద్దు చేసి ఓపెన్ టెండ ర్ల ద్వారా కార్మికుల హక్కులను, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ నారాయణ ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం జలమండలిలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై కార్మిక శాఖ హైదరాబాద్ జాయింట్ కమిషనర్ సునీత సమక్షంలో యూనియన్ నాయకులు, బోర్డు అధికారులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేటగిరి మార్పు, ఓటీ, సెలవులు, ఆరోగ్య బీమా, ప్రమాదబీమా, యూనిఫారం, సకాలంలో వేతనాలు, సీవరేజ్ కార్మికులకు పరికరాలు, తదితరా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కార్యకలాపాలను నిర్వహించే ఏజెన్సీల కాలపరిమితి పూర్తి అయినా కొనసాగించడంలో ఆంతర్యమేమి టీ అని ప్రశ్నించారు. ఏజెన్సీల పొడిగింపును నిలిపివేసి ఓపెన్ టెండర్లు వేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అందుబాటులో ఉండి సేవలందించే విధంగా నిబంధనలు పెట్టాలన్నారు. లేదంటే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జాయింట్ కమిషనర్ సునీతకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, నాయకులు సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రాజ్, కుమార్, బాలకృష్ణారెడ్డి, రమేశ్, నరేశ్, బాలాజీ పాల్గొన్నారు.

కార్మిక శాఖ హైదరాబాద్ సంయుక్త కమిషనర్ సునీతకు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ అధ్యక్షుడు నారాయణ , కార్మికులు

ఒకే ఇంట ముగ్గురు సరస్వతీ పుత్రులు

పేదరికం వారి చదువుకు అడ్డుకాగా.. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన గురుకుల పాఠశాలలు అండగా నిలిచాయి. ఒకే ఇంట్లో ముగ్గురు ఇంజినీరింగ్, మెడిసిన్, ఇంటర్‌లో ప్రవేశాలు పొందగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కేటీఆర్ వారిని అభిందించారు. రంగారెడ్డినగర్ డివిజన్, వెంకటరామిరెడ్డినగర్‌కు చెందిన రామకృష్ణ, లావణ్య దంపతులకు స్వాతి, తరుణ్‌తేజ్, శ్వేత సంతానం. స్వాతి అంకిరెడ్డిపల్లి గురుకులలో చదివి సంగారెడ్డి జెన్‌టీయూలో ఇంజినీరింగ్ సీటు సాధించింది. తరుణ్‌తేజ్ తుర్కపల్లిలో ఇంటర్ చదివి భూపాలపల్లి మెడికల్ కాలేజీలో సీటు పొందాడు. చిన్న కుమార్తె ఘట్‌కేసర్‌లో గురుకుల సీటు పొంది ఇంటర్ చదువుతున్నది. ఈ ముగ్గురు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి బుధవారం కేటీఆర్‌ను కలవగా.. వారిని అభినందించారు. భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

– కుత్బుల్లాపూర్, అక్టోబర్ 16

ఫీజు రీయింబర్స్‌మెంట్ అందేలా కృషి చేయాలి

బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి..సమస్యను వివరిస్తున్న రాపర్తి సురేశ్ గౌడ్ , తదితరులు

రామంతాపూర్, అక్టోబర్ 16 : విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రంగారెడ్డి జిల్లా ప్రైవేట్ కళాశాలల కమిటీ అధ్యక్షుడు రాపర్తి సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మాజీ మంత్రి కేటీ రామారావును కలిసి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని డిగ్రీ , పీజీ కళాశాలల్లో విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే.. కళాశాలల్లో అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే కొన్ని డిగ్రీ, పీజీ కళాశాలలు ముసివేశామని, ఉన్నవి కూడా మూసివేయకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చేలా కృషి చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేటీఆర్.. డిగ్రీ, పీజీ విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయండి

ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర

హిమాయత్‌నగర్ వైజంక్షన్ వద్ద ఆందోళన చేస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

హిమాయత్‌నగర్, అక్టోబర్ 16: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను సత్వరమే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, బీఈడీ విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.7,700 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం హిమాయత్‌నగర్ వైజంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన రుసుం, ఉపకార వేతనాల కోసం ప్రతి ఏడాది సుమారు 12.50లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటారని, అయితే.. నిధులను మంజూరు చేయకపోవడం దారుణమని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి .. ఇప్పుడు విస్మరించిందని అన్నారు. ఈ కార్య క్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, నగర అధ్యక్షుడు బాలకృష్ణ, నగర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నేతలు షేక్ మ హమూద్, కల్యాణ్, అనిల్‌కుమార్, మురళి, కిషన్, రవి,మృణాళిని, దీప్తి, హసీనా, రమ్య, రవళి పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మంద నవీన్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులు

మలక్‌పేట, అక్టోబర్ 16: నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మంద నవీన్ ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని జాతీయ రహదారిపై విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎన్నో వాగ్దానాలుచేసి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వాటిని విస్మరించి, ఒంటెద్దు పోకడలతో విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని అన్నారు. త్వరలోనే రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెబుతామని, విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న ఎవరూ చరిత్రలో నిలదొక్కుకున్న దాఖలాలు లేవని అన్నారు. కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చేలా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు విద్యా వ్యవస్థకు గొడ్డలి పెట్టులా ఉంటున్నాయని అన్నారు. విద్యార్థులు, యువత భవిష్యత్ కన్నా ఏది ముఖ్యమైంది కాదని, ఇప్పటికైనా కళ్లు తెరచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శ్యాం, రమేశ్, ఝాన్సీ, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.